# సాక్షి ప్రకాశం

శుక్రవారం । 8 । డిసెంబర్ । 2023






## తుఫాన్ నష్టం అపారం

మిచాంగ్ తుఫాన్ ప్రభావానికి జిల్లాలో పంటలు భారీగా దెబ్బతిన్నాయి. 60,676 ఎకరాల్లో సాధారణ పంటలకు, 6711.8 ఎకరాల్లో ఉద్యాన వన పంటలకు నష్టం వాటిల్లింది. - 8లో..



## కంభం చెరువులో పడి యువకుడు మృతి

సరదాగా చేపల వేటకు కంభం చెరువుకు వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి మృతిచెందాడు. స్నేహితుడు కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. - 8లో..

## వాతావరణం

గరిష్టం/కనిష్టం
29/23

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్


### నిలిపివేసిన రైళ్లను పునరుద్ధరించాలి

- పార్లమెంట్‌లో ఎంపీ మాగుంట

ఒంగోలు: కోవిడ్ సమయంలో పలు రైళ్లను, పలు రైల్వేస్టేషన్లలో రైళ్ల నిలుపుదలను ఆపివేశారని, వాటిని నేటికీ పునరుద్ధరించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి గురువారం పార్లమెంట్‌లో ప్రస్తావించారు. రూల్ 377 కింద ఆయన మాట్లాడుతూ ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని సింగరాయకొండ, టంగుటూరు, దొనకొండ రైల్వే స్టేషన్లలో రైల్వే సేవలను విస్తృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. తగినన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు లేకపోవడంతో ఇబ్బందులు పెరుగుతున్నాయని తెలిపారు. నూతనంగా కూడా ఎటువంటి రైళ్లను ప్రవేశపెట్టకపోవడంతో సమస్య నెలకొందన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని గతంలో పలు స్టేషన్లలో ఆపిన రైళ్లను తిరిగి ఆయా స్టేషన్లలో ఆపేలా చర్యలు తీసుకోవాలని, అదనపు రైళ్లకు కూడా సంబంధిత స్టేషన్లలో స్టాపింగ్ పాయింట్ ఇవ్వాలని ఎంపీ మాగుంట కోరారు.

### నేడు కొత్తపట్నంలో కలెక్టర్ 'స్పందన'

కొత్తపట్నం: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ప్రతి మండలంలో కలెక్టర్ నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమం శుక్రవారం కొత్తపట్నం ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతుందని ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి తెలిపారు. కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి హాజరవుతారని చెప్పారు. జిల్లా, మండల స్థాయి అధికారులంతా పాల్గొనాలని కోరారు. మండల ప్రజలు సమస్యలపై అర్జీలు అందజేసి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



ఈ నెల 1వ తేదీ ఒంగోలులో పింఛన్ నగదు అందుకున్న ఆనందంలో పి.సారమ్మ

వృద్ధులు, దివ్యాంగులు, అనాథలు, ఒంటరి మహిళలు, కిడ్నీ బాధితులు.. ఇలా చెప్పుకుంటూపోతే చివరకు డప్పుకళాకారులకు సైతం రాష్ట్ర ప్రభుత్వం ఆలంబనగా నిలుస్తోంది. ప్రతి నెలా వారందరికీ పింఛన్లు అందజేస్తూ ఆర్థిక భరోసా ఇస్తోంది. గత టీడీపీ ప్రభుత్వంలో వీరంతా పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యారు. కొత్తగా పింఛన్ కోసం నమోదు చేయించుకునేందుకు, నెలనెలా పింఛన్ నగదు పొందేందుకు అష్టకష్టాలు పడ్డారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం దక్కలేదు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలతో నాలుగేళ్లుగా ఒకటో తేదీ ఉదయాన్నే వలంటీర్ల చేతుల మీదుగా ఇంటి వద్దనే పింఛన్ అందుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 2,93,046 మంది రూ.81.48 కోట్ల మేర లబ్ధిపొందుతున్నారు.

# ఆపన్నులకు అండగా..

- పింఛన్ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక భరోసా
- జిల్లా వ్యాప్తంగా 2,93,046 మందికి పింఛన్ల పంపిణీ
- ప్రతి నెలా రూ.81.48 కోట్లు అందజేత
- డప్పుకళాకారులకు సైతం చేయూత
- 1,61,972 మందికి ఓఏపీ పింఛన్లు

**జిల్లాలో పింఛన్ల పంపిణీ ఇలా...**

| పథకం పేరు | లబ్ధిదారుల సంఖ్య | పంపిణీ చేస్తున్న నగదు |
|---|---|---|
| అభయ హస్తం | 4,818 | రూ.24.09 లక్షలు |
| అమరావతి ల్యాండ్ పూలింగ్ పింఛన్ | 6 | రూ.15 వేలు |
| సీకేడీయూ | 565 | రూ.56.50 లక్షలు |
| డప్పు కళాకారులు | 4,783 | రూ.1.43 కోట్లు |
| దివ్యాంగులు | 33,205 | రూ.9.96 కోట్లు |
| డీఎంహెచ్ఓ పరిధిలో | 2,540 | రూ.13.08 కోట్లు |
| మత్స్యకారులు | 2,570 | రూ.70.67 లక్షలు |
| వృద్ధాప్య పింఛన్లు | 1,61,972 | రూ.44.54 కోట్లు |
| కళాకారులు | 66 | రూ.1.98 లక్షలు |
| సైనిక్ వెల్ఫేర్ పింఛన్లు | 24 | రూ.12 లక్షలు |
| ఒంటరి మహిళలు | 7,854 | రూ.2.15 కోట్లు |
| కల్లుగీత కార్మికులు | 249 | రూ.6.84 లక్షలు |
| చర్మకారులు | 5,399 | రూ.1.48 కోట్లు |
| ట్రాన్స్‌జెండర్లు | 89 | రూ.2.67 లక్షలు |
| చేనేతలు | 1,861 | రూ.51.17 లక్షలు |
| వితంతువులు | 67,045 | రూ.18.43 కోట్లు |

మార్కాపురం:

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆపన్నులకు అండగా నిలుస్తోంది. ప్రతి నెలా పింఛన్ల రూపంలో ఆర్థికంగా ఆదుకుంటోంది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గత ఎన్నికలకు ముందు నిర్వహించిన పాదయాత్రలో వృద్ధులు, దివ్యాంగులు, అనాథలు, ఒంటరి మహిళలు, కిడ్నీ బాధితులు, తదితర అభాగ్యుల కష్టాలను స్వయంగా తెలుసుకున్నారు.



ఒంగోలు బృందావన్‌నగర్‌లో పి.సుశీలమ్మకు ఈ నెల 1వ తేదీ పింఛన్ నగదు అందిస్తున్న వలంటీర్ అనూషా

అప్పటి టీడీపీ ప్రభుత్వం అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయకుండా జన్మభూమి కమిటీలు ఆమోదించిన పచ్చ పార్టీ వారికే నమోదు చేసింది. వారికి కూడా సక్రమంగా పంపిణీ చేయకుండా ప్రతి నెలా కార్యాలయాల చుట్టూ తిప్పుకుని ఇబ్బందులకు గురిచేసింది. పింఛన్ పొందుతున్న వారిలో ఎవరైనా మరణిస్తేనే కొత్త వారిని ఎంపిక చేసింది. ఇలా అనేక రకాలుగా అవస్థలు పడుతున్న వారిని ఆదుకునేందుకు సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థలు ఏర్పాటు చేసి ప్రతి నెలా 1వ తేదీ ఉదయాన్నే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్ అందిస్తున్నారు. ఆర్థికంగా ఆదుకుంటూ వారిలో మనోధైర్యాన్ని నింపుతున్నారు. ఒక్కొక్కరికి నెలకు రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకూ పింఛన్ అందిస్తూ వారి జీవితాల్లో వెలుగులు తీసుకొస్తున్నారు. నేనున్నానంటూ భరోసా ఇస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 2,93,046 మంది పింఛన్‌దారులు ఉండగా, ప్రతి నెలా రూ.81.48 కోట్లు అందిస్తున్నారు. 1 నుంచి 5వ తేదీలోపు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. కులాలు, మతాలు, వర్గాలు, పార్టీలతో సంబంధం లేకుండా దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ అర్హతే ప్రామాణికంగా పింఛన్ అందిస్తున్నారు. అవ్వాతాతల మోహాల్లో సంతోషమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. దీంతో పాటు ప్రతి సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు కూడా ఉచితంగా అందిస్తున్నారు. తద్వారా అభాగ్యుల ఆరోగ్యానికి కూడా భరోసా ఇస్తున్నారు. వైద్యారోగ్య శాఖకు సంబంధించిన ఈ కార్యక్రమం ద్వారా కూడా కిడ్నీ, లివర్ బాధితులు, వీల్‌చైర్‌కి, మంచానికి పరిమితమైన వారికి, తలసేమియా, బోధకాలు బాధితులకు కూడా పింఛన్లు అందిస్తున్నారు.

### సీఎం జగన్ పెద్ద కొడుకులా ఆదరిస్తున్నారు



నేను మార్కాపురం పట్టణం 16వ బ్లాక్‌లోని భగత్‌సింగ్‌నగర్‌లో నివాసం ఉంటాను. నాకు ప్రతి నెలా 1వ తేదీ ఉదయం 6 గంటలకల్లా పింఛన్ అందుతోంది. మా వలంటీర్ సతీష్ పింఛన్ డబ్బును ఇంటికి తీసుకొచ్చి నిద్రలేపి మరీ ఇస్తున్నాడు. వచ్చే నెల నుంచి రూ.3 వేలు ఇస్తారని తెలిసి ఆనందంగా ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దకొడుకులా నన్ను చూసుకుంటున్నాడు.

– సున్నం గురవమ్మ, 16వ బ్లాక్, మార్కాపురం

### జిల్లా వ్యాప్తంగా 2,93,046 మందికి పింఛన్లు



జిల్లా వ్యాప్తంగా వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, వివిధ చేతి వృత్తులకు సంబంధించి మొత్తం 2,93,046 మందికి ప్రతి నెలా 81.48 కోట్ల రూపాయలను ప్రభుత్వం పింఛన్లుగా అందిస్తోంది. 1 నుంచి 5వ తేదీలోపు సచివాలయాల పరిధిలోని వలంటీర్ల ద్వారా లబ్ధిదారులకు పింఛన్ నగదు అందుతోంది.

– రవికుమార్, పీడీ, డీఆర్‌డీఏ

### ప్రతి నెలా 1వ తేదీనే పింఛన్ అందుతోంది



నేను మార్కాపురం 17వ బ్లాక్‌లో కరెంటు ఆఫీసు వెనుక ప్రాంతంలో నివాసం ఉంటున్నాను. ప్రతి నెలా 1వ తేదీ మా వార్డు వలంటీర్ ఎస్‌కే కరీంబాషా ఇంటికి వచ్చి పింఛన్ ఇస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది. ఈ పింఛన్ డబ్బు కుటుంబ ఖర్చులకు ఎంతో ఉపయోగపడుతోంది.

– పఠాన్ మెహరూన్, 17వ బ్లాక్, మార్కాపురం

## ఎన్నికలు సజావుగా జరగాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, వేదికపై ఎస్పీ మలికాగర్గ్, జేసీ శ్రీనివాసులు, ఏఎస్పీలు

- కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికాగర్గ్
- ఎస్‌ఓలు, పీఎస్‌ఓలతో ప్రత్యేక సమావేశం

ఒంగోలు టౌన్: సమస్యాత్మక ప్రాంతాలు, క్లిష్టమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవడం ద్వారా ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఎస్‌ఓలు, పీఎస్‌ఓలను ఆదేశించారు. స్థానిక జీజీహెచ్ ఆడిటోరియంలో వారితో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విధుల నిర్వాహణ గురించి కలెక్టర్‌తో పాటు ఎస్పీ మలికా గర్గ్ దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ ప్రసంగిస్తూ ఎన్నికలు సజావుగా, సక్రమంగా జరిగేలా చూడటంలో సెక్టారు అధికారులు (ఎస్‌ఓలు), పోలీసు సెక్టారు అధికారులు (పీఎస్‌ఓలు)ది కీలకపాత్ర అని స్పష్టం చేశారు. ఎన్నికలకు ఆరునెలల ముందుగానే ఎస్‌ఓలను నియమించడంలో ముఖ్య ఉద్దేశం అదేనన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రాగానే ఎస్‌ఓలకు మెజిస్టీరియల్ అధికారాలు వస్తాయని తెలిపారు. వారికి కేటాయించిన సెక్టార్లలోని పోలింగ్ కేంద్రాలు, రూట్ మ్యాప్, స్థానిక పరిస్థితులపై అవగాహన పెంపొందించుకోవాన్నారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లడానికి ఓటర్లకు ఉన్న మార్గాలు, వివిధ రూపాల్లో ఎదురయ్యే అడ్డంకులు, ఎన్నికల గత చరిత్రపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని ఆదేశించారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో కల్పిస్తున్న వసతులను కూడా క్షుణ్ణంగా తెలుసుకోవాలని చెప్పారు. వివిధ వర్గాల ప్రజలతో మాట్లాడటంతో పాటు పరిస్థితులను బట్టి మీ స్థాయిలోనే నిర్ణయం తీసుకుని పైఅధికారులకు నివేదించాలని దిశానిర్దేశం చేశారు. ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా జరిగేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారనే విశ్వాసాన్ని ఓటర్లలో కలిగించాల్సిన బాధ్యత ఎస్‌ఓలు, పీఎస్‌ఓలపైనే ఉందని స్పష్టం చేశారు. ఆ దిశగా సమన్వయంగా పనిచేయాలన్నారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన సూచనల మేరకు విధులు నిర్వహించాలని అదేశించారు. ఎస్‌ఓలు, పీఎస్‌ఓలు ప్రత్యక్షంగా ఎన్నికల కమిషన్ ఆధీనంలో పని చేయాల్సి ఉంటుందని ఎస్పీ మలికాగర్గ్ చెప్పారు. విధి నిర్వహణలో పరిశీలించిన అంశాలను కేవలం పైస్థాయి అధికారులకు మాత్రమే నివేదించాల్సి ఉంటుందని చెప్పారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తినా మీడియాతోగానీ, స్థానిక నాయకులతోగానీ ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోరాదని స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన హ్యాండ్ బుక్‌లోని మార్గదర్శకాలను, ఎంసీసీ నిబంధనలను ఏమాత్రం ఉల్లంఘించరాదని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు, డీఆర్‌ఓ ఆర్.శ్రీలత, ఏఎస్పీలు కె.నాగేశ్వరరావు (అడ్మిన్), ఎస్వీ శ్రీధర్‌రావు (క్రైం), అశోక్‌బాబు (ఏఆర్), మార్కాపురం సబ్ కలెక్టర్ సేతుమాధవన్, ఒంగోలు ఆర్డీఓ విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి




లబ్ధిదారులకు ఆటో తాళాలు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ దినేష్‌కుమార్, మేయర్ గంగాడ సుజాత, డీటీసీ సుశీల

- కలెక్టర్ దినేష్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పిలుపు
- 12 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆటోల పంపిణీ

ఒంగోలు అర్బన్: స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు మెరుగైన జీవనోపాధితో ఆర్థికంగా మరింత ఎదగాలని, అందుకు మహిళా శక్తి ఆటో పథకం ఎంతగానో ఉపకరిస్తుందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. డీఆర్‌డీఏ, వైఎస్సార్ కేపీ ఆధ్వర్యంలో జిల్లాలో 12 మంది ఎస్సీ, ఎస్టీ స్వయం సహాయక సంఘాల సభ్యులకు మహిళా శక్తి ఆటో పథకం కింద వడ్డీ లేకుండా రూ.35,66,945 విలువైన ఆటోలను గురువారం కలెక్టరేట్‌లో అందజేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మేయర్ గంగాడ సుజాతతో కలిసి జెండా ఊపి లబ్ధిదారుల ఆటోలను కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆటోలు పొందిన మహిళలు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి 18–45 సంవత్సరాల వయసు ఉండాలన్నారు. లబ్ధిదారులు కోరుకున్న ఆటో మోడల్ ఖరీదులో 10 శాతం వాటాను ముందుగా ఎస్‌హెచ్‌జీ పొదుపు ఖాతాలో జమ చేయాల్సి ఉంటుందన్నారు. లబ్ధిదారుల పేరుపై ఆటో రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల నుంచి వడ్డీ లేని రుణంగా ఈ అప్పు ఇస్తామన్నారు. 48 నెలలు వాయిదాల పద్ధతిలో తిరిగి చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుత లబ్ధిదారుల్లో 9 మంది ఎస్సీలు, ముగ్గురు ఎస్టీలు ఉన్నట్లు తెలిపారు. వారికి మంజూరు చేసిన ఒక్కో ఆటో ఖరీదు మోడల్‌ను బట్టి కనిష్టంగా రూ.2,53,000 నుంచి గరిష్టంగా రూ.3,35,000 వరకు ఉన్నట్లు తెలిపారు. డ్రైవింగ్ వచ్చిన, లైసెన్స్ కలిగిన మహిళలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాలతో పాటు మహిళలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్ని విధాలుగా అండగా ఉంటున్నారన్నారు. ఆ దిశగా అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత మహిళలు స్వశక్తితో నిలబడేలా ఆటోలు నడిపేందుకు ముందుకు రావడం మహిళా శక్తికి నిదర్శనమన్నారు. మహిళలు ఆర్థికంగా ముందడుగు వేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహానికి ఈ పథకం ఉదాహరణగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, డీటీసీ ఆర్.సుశీల, డీపీఎంలు, ఏపీఎంలు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.



ఆటో ఎక్కి లబ్ధిదారులను ప్రోత్సహిస్తూ...

## యువకుడి ఆత్మహత్యాయత్నంపై మంత్రి సురేష్ సీరియస్

యర్రగొండపాలెం: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంపై రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సీరియస్ అయ్యారు. ఈ సంఘటనను ఆయన తీవ్రంగా పరిగణించారు. ఆ మేరకు గురువారం పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. స్థానిక పోలీసులు బుధవారం మోజెష్, అతని తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆ సమయంలో సీఐ మారుతీకృష్ణ వారి పట్ల దురుసుగా ప్రవర్తించారు. దానివలన మోజెష్ తీవ్రమనస్తాపానికి గురై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. ఈ సంఘటన తెలిసిన వెంటనే మంత్రి సురేష్ స్పందించి పూర్తి స్థాయిలో విచారణ జరపాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. తీవ్రంగా గాయపడిన మోజెష్‌కు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. గుంటూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్న మోజెష్‌తో పాటు అతని తల్లిదండ్రులతో మంత్రి ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. స్వయంగా తాను కలిసి మాట్లాడతానని, కుటుంబానికి అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ఈ సంఘటనలో ఎవరు దోషులుగా తేలినా ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.



## ఐసీడీ కోడ్స్‌పై అవగాహన అవసరం

- వైద్యులతో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్‌నాయక్

ఒంగోలు టౌన్: ప్రపంచ వ్యాప్తంగా వైద్య రంగంలో వస్తున్న పెనుమార్పులపై వైద్యులు ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకోవాలని స్థానిక జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్‌నాయక్ సూచించారు. బెంగళూరుకు చెందిన హెల్త్ బ్యూరో ఆఫ్ ఇంటెలిజెన్స్ ఐసీడీ కోడ్స్‌పై గురువారం జీజీహెచ్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. భగవాన్‌నాయక్ సదస్సును ప్రారంభించగా, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ తిరుమలరావు అధ్యక్షత వహించారు. వైద్య రంగంలో ఐసీడీ కోడ్స్ కీలకం కానున్నాయని హెల్త్ బ్యూరో రిసోర్స్‌పర్సన్ డాక్టర్ వహీద్ తెలిపారు. వివిధ విభాగాల్లో పని చేస్తున్న అన్ని స్థాయిల్లోని వైద్యులు, వైద్య సిబ్బంది కోడ్స్‌పై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. చికిత్సలో ప్రతి సందర్భంలోనూ వైద్య పరిభాషపరంగా ఐసీడీ కోడ్స్ అవసరం ఎంతో ఉంటుందని వివరించారు. భాష, ఇతర ప్రాంతాల్లో వాడే టెర్మినాలజీ సమస్యలకు పరిష్కారంగా ఐసీడీ కోడ్స్‌ను పేర్కొనవచ్చన్నారు. ఈ సదస్సులో సీబీహెచ్ఐ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నందీశ్వరరావు, హెచ్ఓడీ డాక్టర్ ప్రభాకరరావు, డాక్టర్ బాలాజీనాయక్, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

## రేపు జాతీయ లోక్ అదాలత్

- విజయవంతం చేయాలని కోరిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి

ఒంగోలు: ఇరువర్గాల ఆమోదంతో కేసుల పరిష్కారానికి కక్షిదారులంతా సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి కోరారు. ఈ నెల 9వ తేదీ రెండో శనివారం కక్షిదారుల సౌకర్యార్థం దేశవ్యాప్తంగా నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ జిల్లావ్యాప్తంగా అన్ని న్యాయస్థానాల్లో జరుగుతుందన్నారు. రాజీపడేందుకు అర్హత కలిగిన అన్ని క్రిమినల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద బీమా పరిహారపు చెల్లింపు కేసులు, వివాహ సంబంధ వ్యాజ్యాలు, అన్ని రకాల సివిల్ కేసులను ఇద్దరి ఆమోదంతో పరిష్కరించనున్నట్లు తెలిపారు. న్యాయస్థానాల్లో పెండింగ్ కేసులు ఉన్న వారంతా ఈ అవకాశాన్ని వినియోగించుకుని వ్యాజ్యాలను పరిష్కరించుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించుకున్న కేసుల్లో పై కోర్టుకు అప్పీలుకు వెళ్లే అవకాశం లేదన్నారు. అంతేగాకుండా కోర్టుల్లో చెల్లించిన ఫీజులు కూడా తిరిగి పొందవచ్చన్నారు. ప్రీ సిట్టింగ్ రూపంలో ఇరువర్గాల ఆమోదంతో ముందస్తుగా వ్యాజ్యాల పరిష్కారానికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ సంబంధిత న్యాయవాదులు, మీడియేషన్ న్యాయవాదులు, న్యాయమూర్తులు సహకరిస్తారన్నారు. పోలీసు అధికారులు, ప్రభుత్వ అధికారులు, న్యాయవాదులు ఎక్కువ సంఖ్యలో కేసుల పరిష్కారానికి సహకరించాలని భారతి కోరారు.

## క్లుప్తంగా

### ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ

**టంగుటూరు:** గ్రామీణాభివృద్ధి, స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు భాగ్యనగర్‌లో డిసెంబర్ 11 నుంచి 30 రోజులపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ కాలంలో భోజనం, వసతి పూర్తిగా ఉచితమని తెలిపారు. ప్రకాశం జిల్లాకు చెందిన 19 నుంచి 45 ఏళ్ల మధ్య వయసున్న పురుషులు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు. వివరాలకు 9573363141ను సంప్రదించాలని సూచించారు.

### 10న బాలకృష్ణారెడ్డి పుస్తకాల ఆవిష్కరణ

**ఒంగోలు టౌన్:** ఈనెల 10వ తేదీన విశ్రాంత న్యాయమూర్తి కె.బాలకృష్ణారెడ్డి రచించిన అక్షర ప్రస్థానం, నా జీవితమే కవిత్వం గ్రంథాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు నాగభైరవ ఆదినారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ చుంచు చలమయ్య పుస్తకాలను ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. స్థానిక అంజయ్య రోడ్డులోని ప్రకాశం జిల్లా కాకతీయ సేవా సమాఖ్య కార్యాయలంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో సాహితీ మిత్రులు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

### ప్రజలకు మెరుగైన వైద్యం

**సింగరాయకొండ(మర్రిపూడి):** ప్రజలందరికీ వైద్యసేవలు సక్రమంగా అందేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని డీఎంహెచ్ఓ ఎస్.రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. సింగరాయకొండలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె గురువారం తనిఖీ చేశారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. వైద్యశాలలో కాన్పులయ్యే వారి వివరాలను సక్రమంగా రికార్డుల్లో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆశా డే సందర్భంగా ఆశా కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలతో సమావేశమై గ్రామాల్లో చేపట్టాల్సిన విధుల గురించి వివరించారు. అనంతరం ఆమె విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని, మండలాలల్లో అదనపు వైద్యశాలలు నిర్మిస్తున్నారని, ఆ ప్రకారం డాక్టర్లు, సిబ్బంది సంఖ్య కూడా పెంచారన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో నైపుణ్యం కలిగిన సిబ్బంది ఉన్నారని పేర్కొన్నారు. సింగరాయకొండలోని ప్రైవేట్ వైద్యశాలలు, మెడికల్ ల్యాబుల్లో నిబంధనలు సక్రమంగా పాటించడం లేదని చెప్పారు. వారికి నిబంధనలను వివరించామన్నారు. కొన్ని ల్యాబ్‌లు మూతవేసి వెళ్లిపోయారన్నారు. వైద్యులు చైతన్యకృష్ణ, శ్రీధర్‌రెడ్డి, వంశీదర్, లీనా రాఫెల్ తదితరులు పాల్గొన్నారు.



# తుఫాన్ నష్టం అపారం

- మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో జిల్లాలో భారీగా పంట నష్టం
- 60,676 ఎకరాల్లో సాధారణ, 6,711 ఎకరాల్లో ఉద్యాన పంటలకు దెబ్బ
- ప్రాథమిక అంచనాను ప్రభుత్వానికి నివేదించిన జిల్లా అధికారులు

**ఒంగోలు సెంట్రల్:** మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో జిల్లాలో ఖరీఫ్, రబీలో సాగు చేసిన పంటలకు భారీగా నష్టం వాటిల్లింది. సాధారణ పంటలు 60,676 ఎకరాల్లో, ఉద్యాన పంటలు 6711.8 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనాలు రూపొందించింది. వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేస్తున్నారు. పంట నష్టంపై ప్రాథమిక అంచనా నివేదికను ప్రభుత్వానికి అందజేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు, ఉద్యాన శాఖ అధికారి వై.గోపీచంద్ పేర్కొన్నారు.



నాగులుప్పలపాడు వద్ద తుఫాన్‌కు దెబ్బతిన్న మిరపను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేడీఏ శ్రీనివాసరావు(ఫైల్)

**దెబ్బతిన్న సాధారణ పంటల వివరాలు**

| | ఖరీఫ్ | | రబీ | | |
|---|---|---|---|---|---|
| పంట | నీట మునిగినది | నేలకు వాలింది | నీట మునిగినది | నేలకు వాలింది | మొత్తం (ఎకరాల్లో) |
| వరి | 2152.5 | 6767.5 | 265 | 1460 | 10,645 |
| మొక్కజొన్న | 510 | 1500 | 915 | 1555 | 4480 |
| కంది | 1502 | 250 | 82.5 | - | 1834.5 |
| మినుము | 22.5 | - | 5480 | 200 | 5702.5 |
| పొగాకు | 50 | 797.5 | 24,745 | - | 25,592.5 |
| జొన్న | - | - | 72.5 | 787.5 | 860 |
| శనగ | - | - | 11,176.5 | - | 11,176.5 |
| పెసర | - | - | 35 | - | 35 |
| ఉలవ | - | - | 7.5 | - | 7.5 |
| వేరుశనగ | - | - | 50 | - | 50 |
| పత్తి | - | - | 105 | - | 105 |
| నువ్వులు | - | - | 132.5 | 55 | 187.5 |
| మొత్తం | 4,236.5 | 9,315 | 43,066.5 | 4,057.5 | 60,676 |

**ఉద్యాన పంటల నష్టం ఇలా..**

| పంట | నష్టపోయిన రైతులు | విస్తీర్ణం (ఎకరాల్లో) |
|---|---|---|
| మిరప | 2,772 | 6331.4 |
| అరటి | 163 | 292.9 |
| బొప్పాయి | 07 | 13.5 |
| నిమ్మ | 5 | 7.5 |
| దానిమ్మ | 4 | 9 |
| జామ | 5 | 10 |
| టమోటా | 20 | 15 |
| బంతిపూలు | 8 | 12.5 |
| చామ | 1 | 1 |
| వంగ | 2 | 4 |
| పుచ్చ | 3 | 12 |
| కూరగాయలు | 2 | 3 |
| మొత్తం | 2,992 | 6711.8 |

# దెబ్బతిన్న ధాన్యాన్ని సేకరించేందుకు చర్యలు

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలిపిన కలెక్టర్ దినేష్‌కుమార్

**ఒంగోలు అర్బన్:** మిచాంగ్ తుఫాన్ నష్టంపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వచ్చాక సర్వే చేసి దెబ్బతిన్న ధాన్యాన్ని రైతుల నుంచి స్థానికంగానే సేకరించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. తుఫాన్ ప్రభావిత జిల్లా కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేస్ జవహర్ రెడ్డి గురువారం వీడియో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ దినేష్‌కుమార్ జిల్లా పరిస్థితులను వివరించారు. స్థానిక మిల్లర్లు, పౌర సరఫరాల సంస్థతో దెబ్బతిన్న ధాన్యాన్ని సేకరిస్తామని తెలిపారు. గ్రామీణ నీటి సరఫరా వ్యవస్థ, పంచాయతీరాజ్ రోడ్లకు నష్టం ఏం జరగలేదని తెలిపారు. మత్స్య సంపదకు, జాలర్ల కుటుంబాలకు ఎటువంటి ప్రమాదం కలగకుండా ఈ నెల 1వ తేదీ నుంచే అప్రమత్తం చేసినట్లు వివరించారు. మొక్క స్థాయిలో పంట నష్టపోయిన శనగ రైతులు 80శాతం రాయితీతో విత్తనాలను అడుగుతున్నట్లు తెలిపారు. రైతులకు 40శాతం రాయితీతో పంపిణీ చేసేందుకు జిల్లాకు వచ్చిన విత్తనాలు ఇప్పటికే ఆరు వేల క్వింటాళ్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. మరో ఐదు వేల క్వింటాళ్లు అవసరం అవుతాయని చెప్పారు. అందుబాటులో ఉన్న విత్తనాలను 80శాతం రాయితీతో పంపిణీ చేసేందుకు సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, పశుసంవర్థక శాఖ జేడీ బేబిరాణి, ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ సత్యనారాయణ, ఆర్అండ్‌బీ ఎస్ఈ దేవానందం, ఇరిగేషన్ ఎస్ఈ లక్ష్మారెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ కొండయ్య, జిల్లా మత్స్య శాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, ఉద్యాన అధికారి గోపిచంద్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తుఫాన్‌తో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- కలెక్టర్‌కు జెడ్పీ చైర్‌పర్సన్ వినతి

**ఒంగోలు అర్బన్:** మిచాంగ్ తుఫాన్‌తో నష్టపోయిన దర్శి నియోజకవర్గ రైతులతో పాటు జిల్లాలోని రైతులను ఆదుకోవాలని కోరుతూ జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ గురువారం ప్రకాశం భవనంలో కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మిరప, పొగాకు, వరి, కంది పంటలకు ఎక్కువగా దెబ్బతినడంతో రైతులు నష్టపోయారని వివరించారు. పంట నష్టం పరిశీలన అంచనాలను ప్రభుత్వానికి నివేదించి ఏ ఒక్క రైతు నష్టపోకుండా చూడాలని కోరారు.



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

## చదువు జీవితాన్ని మార్చే దిక్సూచి



జిల్లా జైలులో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వరుణారెడ్డి

- జిల్లా జైలు సూపరింటెండెంట్ వరుణారెడ్డి

**ఒంగోలు టౌన్:** చదువు మనిషి విచక్షణను, జ్ఞానాన్ని ఇవ్వడమే కాకుండా జీవితాన్ని సన్మార్గంలో నడిపే దిక్సూచిలా పనిచేస్తుందని జిల్లా జైలు సూపరింటెండెంట్ పి.వరుణారెడ్డి అన్నారు. వయోజన విద్య అవశ్యకతపై గురువారం జిల్లా జైలులో ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సూపరింటెండెంట్ వరుణారెడ్డి మాట్లాడుతూ జీవితం మీద సరైన అవగాహన లేని వారే క్షణికావేశానికి గురై చిన్న చిన్న నేరాలకు పాల్పడుతున్నారని చెప్పారు. ప్రస్తుతం జిల్లా జైలులో నేరాలు ఆరోపించిన వారే ఎక్కువ మంది ఉంటారని, ఇంకా వారు చేసిన నేరం నిరూపణ కాలేదని తెలిపారు. జైలులో ఉన్న సమయంలో ఆవేశావేశాలను తగ్గించుకొని విచక్షణతో ఆలోచించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. జైలు నుంచి బయటకు వెళ్లిన తరువాత సత్ప్రవర్తనతో సమాజం మెచ్చుకునేలా నడుచుకోవాలని హితవు పలికారు. చదువు అనేది అనేక మార్పులకు శ్రీకారం చుడుతుందని, కేవలం డిగ్రీలే కాకుండా సంస్కారం, నైతిక విలువలు నేర్పుతుందని చెప్పారు. ఎలాంటి కారణం చేతనైనా చిన్న వయసులో చదువుకోలేక పోయిన వారికి దూరవిద్య ద్వారా చదువుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. ఇప్పుడైనా ప్రతి ఒక్కరూ చదువుకొని సమాజంలో హుందాగా జీవించాలని కోరారు. చదువుకోవాలనే ఆసక్తి ఉన్న ఖైదీలకు వయోజన విద్య ద్వారా సహకారం అందజేస్తామని వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ పి.వెంకటేశ్వర్లు తెలిపారు. జైలులోని ప్రతి బ్యారక్‌లో ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేసి వయోజన విద్య సూపర్‌వైజర్ల ద్వారా చదువు చెప్పించేందుకు ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. మెటీరియల్‌ను కూడా ప్రభుత్వమే పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో జైలర్ వి.రమేష్, వయోజన విద్య అధికారులు టి.శ్రీనివాసరావు, కె.జ్యోతి, ఆర్.సురేఖ, డి.తిరుపతమ్మ, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎలుగుబంటి దాడి

- ప్రొటెక్షన్ వాచర్‌కు తీవ్ర గాయాలు....



గాయపడ్డ చెవుల వెంకటేశం

**పెద్దదోర్నాల:** ఎలుగుబంటి దాడి చేయడంతో ప్రొటెక్షన్ వాచర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన యర్రగొండపాలెం మండలం ఆరపెంట సమీపంలోని పెద్దవాగు వద్ద గురువారం సాయంత్రం జరిగింది. ఈ సంఘటనలో ఇష్టకామేశ్వరీ ఆలయ రహదారికిలోని బేస్ క్యాంపుకు చెందిన ప్రొటక్షన్ వాచర్ చెవుల వెంకటేశం తీవ్రంగా గాయపడ్డాడు. అందిన సమాచారం మేరకు..ఇష్టకామేశ్వరీ గూడేనికి చెందిన చెవుల వెంకటేశం విధులు ముగించుకుని నడచుకుంటూ ఇష్టకామేశ్వరి గూడేనికి వెళ్తున్న సమయంలో ఎలుగుబంటి దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. గాయపడిన వెంకటేశంను దట్టమైన అటవీప్రాంతం గుండా బేస్‌క్యాంపుకు తరలించి 108 వాహనంలో మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స నిర్వహించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరుకు తరలించారు.

## వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

**మద్దిపాడు:** బస్సు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మద్దిపాడు ఫ్లైఓవర్ సమీపంలో వెల్లంపల్లి వైపు వెళుతున్న సర్వీస్ రోడ్డులో మద్యం సేవించి బస్సుకు అడ్డుగా వెళడంతో తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి 108కు సమాచారం అందించగా వారు క్షతగాత్రుని ఒంగోలు రిమ్స్‌కు తరలించగా అక్కడి వైద్యులు మృతి చెందినట్లు గుర్తించి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. అదే విధంగా మద్దిపాడు ఫ్లైఓవర్ ఒంగోలువైపు వెళ్లే సర్వీసు రోడ్డులో మోటార్‌సైకిల్ స్కూటీ ఢీకొన్న క్రమంలో మద్దిపాడుకు చెందిన కొంగల నాగరాజు(42) తీవ్రంగా తలపై గాయాలు కావడంతో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే..నాగరాజు బుధవారం రాత్రి 9 గంటల సమయంలో ఒంగోలు వైపు వెళ్లే సర్వీసు రోడ్డులో మోటార్‌సైకిల్‌పై వెళుతుండగా ఎదురుగా స్కూటీపై ఎదురుగా వస్తున వ్యక్తి ఢీకొన్నారు. ఇద్దరికి గాయాలు కావడంతో 108 ద్వారా ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. నాగరాజు పరిస్థితి విషమించడంతో ఒంగోలులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి అక్కడ నుంచి గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం 6 గంటల సమయంలో మృతి చెందినట్లు ఆస్పత్రి వర్గాలు మద్దిపాడు పోలీసులకు సమాచారం అందించారు. మద్దిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కంభం చెరువులో పడి యువకుడి మృతి



కంభం చెరువుపైకి భారీగా చేరుకున్న మృతుడి స్నేహితులు, బంధువులు



మృతదేహాన్ని బయటకు తెస్తున్న స్నేహితులు

- చేపలు పడుతూ జారిపడిన వైనం



ఇర్ఫాన్ (ఫైల్)

**కంభం:** కంభం చెరువులో సరదాగా చేపల వేటకు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే నాయక్ వీధికి చెందిన షేక్ ఇర్ఫాన్ (25) స్నేహితులతో కలసి గురువారం మధ్యాహ్నం కంభం చెరువుకట్టపై చేపల వేటకు వెళ్లాడు. స్థానికులు తెలిపిన కథనం మేరకు.. చేపలు పడుతున్న సమయంలో గాళానికి ఉన్న బెండును చేపలాక్కెళ్లడంతో చెరువులో ఈతకొడుతూ ముందుకు వెళ్లి బెండు తీసుకొని వెనక్కి వస్తున్న సమయంలో ఒక్కసారిగా మునిగిపోయాడు. అదే సమయంలో అక్కడే ఉన్న స్నేహితుడు మున్నా చెరువులోకి దూకి బయటకు తీసుకొచ్చే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. చెరువు గట్టుకు కొంతదూరంలో నీళ్లలో మునిగిన ఇర్ఫాన్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు భారీ సంఖ్యలో కంభం చెరువుకట్టపైకి చేరుకున్నారు. గజఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీసి కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

**కుటుంబంలో విషాదం**

ఇర్ఫాన్ తండ్రి ఐదేళ్ల క్రితం చనిపోయాడు. తల్లి, ఇద్దరు అక్కలు ఉన్నారు. ఇద్దరికి వివాహం కాగా చిన్నవాడైన ఇర్ఫాన్ ఎలక్ట్రికల్, ఏసీ పనులు చేసుకుంటూ తల్లిని పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఒక్కగానొక్క కుమారుడు ఇలా మృత్యువాత పడటంతో కుటుంబంలో విషాదం నెలకొంది. త్వరలో కుమారుడికి పెళ్లి చేయాలనుకొని కళలు కంటున్న ఆ తల్లికి కుమారుడిని మృత్యువు కబళించడంతో బోరున విలపిస్తోంది.

## మాజీ సైనికులకు అండగా ఉంటాం

- సాయుధ దళాల పతాక దినోత్సవంలో కలెక్టర్ దినేష్‌కుమార్



మాజీ సైనికులకు జ్ఞాపికలు అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

**ఒంగోలు అర్బన్:** మాజీ సైనికుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, అన్ని విధాలుగా అండగా ఉంటామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం ప్రకాశం భవనంలో సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సాయుధ దళాల పతాక దినోత్సవంలో కలెక్టర్ పాల్గొన్నారు. గత ఏడాది అధికంగా విరాళాలు ఇచ్చిన పలు శాఖల అధికారులు, పరిశ్రమలు, సంస్థల ప్రతినిధులకు జ్ఞాపికలు అందజేసి అభినందించారు. అత్యుత్తమ సేవలు అందించిన 9 మంది మాజీ సైనికులకు, ఎన్‌సీసీ సిబ్బందికి అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రథమ విరాళాన్ని హుండీలో వేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నగర మేయర్ గంగాడ సుజాత విరాళం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి రజనీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# ఉత్తమ యాజమాన్యమే ఉద్యాన పంటలకు రక్ష

- జిల్లా ఉద్యానవన శాఖాధికారి వై గోపిచంద్

**ఒంగోలు సెంట్రల్:** మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో భారీగా వర్షాలు కురిసిన నేపథ్యంలో ఉద్యాన పంటల రక్షణకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి వై.గోపిచంద్ సూచించారు. ముఖ్యంగా కూరగాయలు, వంగ, మిరప, అరటి, బొబ్బాయి, నిమ్మ, బత్తాయి రైతులు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు.

**కూరగాయలు(మిరప, టమాట, వంగ) :** పంట పొలంలో నిలిచిన నీటిని సాధ్యమైనంత త్వరగా బయటకు పంపాలి. వర్షాలు ఆగిన వెంటనే 19: 19: 19 లేదా 13:0:45 లేదా యూరియా లాంటి పోషకాలు పంటలపై పిచికారీ చేయాలి. అంతర సేద్యం చేసి కలుపును తొలగించడమే కాకుండా నేల త్వరగా ఆరేలా చేసుకోవాలి. నీరు నిలవడం వల్ల ఎండు తెగులు ఆశించే అవకాశం ఉన్నందున నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రా. మందును లీటర్ నీటికి లేదా మెటలాక్సిల్, మాంకోజెబ్ 2.గ్రా. మందును లీటరు కలిపి మొక్కల పాదల్లో పొయ్యాలి. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గడం వల్ల ఆకుమచ్చ తెగులు, బూజు తెగులు ఆశించే అవకాశం ఉన్నందున నివారణకు కార్బండిజం ఒక గ్రా. మందును లీటరు నీటికి కలిపి లేదా మాంకోజెబ్ 2 గ్రా. మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. బూజు నివారణకు డైమిథోమార్ఫ్ 1.5 గ్రా. లేదా మెటలాక్సిల్ మాంకోజెబ్ 2.0 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. బ్యాక్టీరియా ఆకుమచ్చ కానోఫారా వంటి తెగుళ్ల ఆశించే అవకాశం ఉంది కాబట్టి ముందు జాగ్రత్త చర్యగా 10 లీటర్ల నీటికి 30 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్, ఒక గ్రా స్ట్రెప్టోసైక్లిన్ కలిపిన ద్రావణం పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది.

**అరటి :** గాలిలో అధిక తేమ వలన సిగటోకా ఆకుమచ్చ తెగులు ఆశించే అవకాశం ఉంది. నివారణకు ప్రొఫికొనజోల్ 1.0 మి.లీ మందును లీటరు నీటికి కలిపి జిగురుతో పాటు పిచికారీ చేయాలి.



జి.ఉమ్మడివరంలో మిరప రైతులకు సూచనలిస్తున్న ఉద్యాన అధికారులు

భూమిలో అధిక తేమ వలన అరటి దుంపలు కుళ్లిపోకుండా నివారించడానికి ఆక్సీ క్లోరైడ్ 3.0 గ్రా. లేదా ఒక శాతం బోర్డో మిశ్రమం దుంప చుట్టూ తడిసేలా పోయాలి.

**బొప్పాయి:** అధిక వర్షాల వల్ల మొక్కలు పసుపు రంగులోకి మారడం, కాండం కుళ్లు లాంటి లక్షణాలు ఉన్నట్లయితే రిడోమిల్ 2.0గ్రా లీటరు నీటికి కలిపి లేదా ఎలైట్ 2.0 గ్రాముల మందును లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్లలో పోయాలి. అధిక వర్షపాతం తర్వాత పండు ఈగ ఉధృతి అధికమయ్యే అవకాశం ఉంది కనుక మిథైల్ యూజినాల్ ఎరలను ఎకరాకు 10-15 ఏర్పాటు చేయాలి.

**నిమ్మ, బత్తాయి :** అధిక వర్షాల వల్ల ముంపునకు గురైన తోటల్లో బంక తెగులు వ్యాప్తిని నివారించడానికి ఒక శాతం బోర్డో మిశ్రమం లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3. గ్రాముల మందును ఒక లీటరు నీటికి కలిపి ఆ ద్రావణాన్ని కొమ్మలు తడిసేలా పిచికారీ చేయాలి. వర్షాల తర్వాత బొబ్బర తెగులు, బ్యాక్టీరియా తెగులు ఎక్కువగా ఆశించే అవకాశం ఉన్నందున వ్యాప్తి తగ్గించడానికి 30 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్, ఒక గ్రాము స్ట్రెప్టో సైక్లిన్ 10 లీటర్ల నీటికి కలిపి 15-20 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని చెప్పారు.

**పూల తోటలు :** చామంతి, బంతి తోటల్లో తేమ కారణంగా తెగుళ్ల ఉధృతి పెరుగుతుంది. నివారణకు ఫ్యూజెరియం ఒడలు తెగులు నివారణకు కార్బండజిమ్ ఒక గ్రామును లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్లలో పోయాలి. తుప్పు తెగులు నివారణకు సల్ఫర్ 0.2 శాతం డస్ట్ వేయాలి. ఆకుమచ్చ తెగులు నివారణకు కార్బండజిమ్ 1 గ్రాముసు లీటరు నీటిని కలిపి పిచికారీ చేయాలి. మొదలు కుళ్లు తెగులు నివారణకు సల్ఫర్ 2 గ్రాములు, లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పువ్వు, మొగ్గ కుళ్లు నివారణకు డైథేన్ ఎం-45 రెండు గ్రాముల మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. మొక్కల మొదళ్ల ఎగదోసి కర్రలు పాతి ఊతమివ్వాలి.

## 10న వడియరాజుల కార్తీక వనభోజనాలు



వడియరాజుల కార్తీక వనభోజన కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంఘ నాయికులు

**ఒంగోలు:** ఏపీ వడియరాజుల సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 10న భైరవకోనలో కార్తీక మాస వనభోజన మహోత్సవం నిర్వహించనున్నట్లు ఏపీ వడియరాజుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తన్నీరు ఆంజనేయులు తెలిపారు. గురువారం స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో నిర్వహించిన వనభోజన మహోత్సవాల కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 9 సంవత్సరాలుగా ప్రతి ఏటా క్రమం తప్పకుండా నిర్వహించడానికి సహాయం అందిస్తున్న ప్రతి వడియరాజు కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు చల్లా నాగేశ్వరమ్మ, జిల్లా అధ్యక్షుడు తన్నీరు వీరసాయి, బాపట్ల జిల్లా అధ్యక్షుడు తన్నీరు గజేంద్ర, ఒంగోలు పట్టణ మహిళా అధ్యక్షురాలు పల్లపు రమాదేవి, కనిగిరి మండలం అధ్యక్షుడు దేవెళ్ల మాధవ, మద్దిపాడు మండల అధ్యక్షుడు వేముల సుబావవ్వ, సీఎస్‌పురం మండలం అధ్యక్షుడు బందారు తిరుపతయ్య, చల్లా బాలకొండయ్య, అయ్యప్పస్వామి ఆలయం ప్రధాన అర్చకులు పరాంకుశం కేశవాచార్యులు పాల్గొన్నారు.